క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద స్వామి సజీవ సమాధి అయిన రోజును పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ద్రాక్షారామ శ్రీ కామాక్షీ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొసనా భీమశంకరం, గౌరవాధ్యక్షుడు కాల్దారి వెంకటేశ్వరరావు, పోలవరపు సుబ్బారావు దంపతులు, పెంటపాటి బ్రహ్మజీ, కొత్తుర్తి బ్రహ్మజీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ద్రాక్షారామకు చెందిన గంధం సత్తిబాబు(35) ఈ నెల 15న రాత్రి సమయంలో పొలానికి వాడే గడ్డి మందు తాగాడు. అతడికి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లారు. అయితే ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో రెండు రోజుల క్రితం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. దీనితో ఆసుపత్రి సమాచారం, భార్య శ్రీ నాగవల్లి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భుజంగరావు తెలిపారు.

మహానాడును అడ్డుకునే కుట్రలు

మండపేట: టీడీపీ మహానాడును అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. అందుకోసమే టీడీపీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, శ్రీనివాసులను సీఐడీ అధికారులతో అరెస్టు చేయించిందన్నారు.

పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలి



మొబైల్ టాయిలెట్లను పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాంలో పలు పర్యాటక స్థలాలను చూసేందుకు వస్తున్న పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్ బీచ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పర్యాటకులకు ఉపకరించే మొబైల్ టాయిలెట్ తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయో స్వయంగా చూశారు. మొబైల్ టాయిలెట్ నిత్యం తాళం వేసి ఉంటుందని తెరిచి ఉంచాలని పలువురు పర్యాటకులు ఆయనను అడిగారు. బీచ్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లరేవు: ఆంధ్రా–యానాం సరిహద్దు ప్రాంతమైన నీరెళ్లంక వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వల్లు ప్రవీణ్(29) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన వల్లు ప్రవీణ్ తన స్నేహితుడు నూకరాజుతో కలిసి బైక్‌పై యానాం వెళ్లి తిరిగి గాడిమొగ వెళుతుండగా నీరెళ్లంక కోళ్లఫారం సమీపంలో ఎదురుగా వస్తున్న మరొక బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ముమ్మిడివరం: అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై కేసు నమోదుచేసినట్లుగా ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం మమ్మిడివరం మండలం అయినాపురం గ్రామానికి చిటికెన వరలక్ష్మి, ఆమె మేనమామ చిటికెన త్రినాథ్ రామశంకర్‌లకు 2012లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నంగా మూడు కుంచాల పొలం, నాలుగు కాసుల బంగారం, రూ.75 వేలు నగదు, రూ.లక్ష సారి సామానులు ఇచ్చారు. అయితే తన భర్త మద్యానికి బానిసై పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురమ్మంటూ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపారు.

వసంతకుమార్‌కు మాజీ ఐఏఎస్ అధికారి నివాళి

అమలాపురం రూరల్: ఇటీవల మృతి చెందిన వన్నెచింతలపూడికి చెందిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పచ్చిమాల వసంత్‌కుమార్ కుటుంబ సభ్యులను మాజీ ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా వసంతకుమార్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

అపరాల సాగుకు అవాంతరాలు

- మూడో పంటకు ప్రాధాన్యమివ్వాలంటున్న అధికారులు
- పలు కారణాలతో వీలుకాని పరిస్థితి



కాజులూరులో యంత్రాలతో పంట కోయటంతో అపరాల సాగుకు పనికిరాకుండా పోయిన వరి పొలం

కాజులూరు: డెల్టా కాలువ శివారు భూముల్లో మూడవ పంటగా రైతులు పెసర, మినుము వంటి అపరాలను విధిగా పండించేవారు. కాలక్రమంలో సాగునీరు విడుదలలో చోటు చేసుకున్న మార్పులతో వరిపంట సాగులో ఆలస్యం, పంటకోతకు యంత్రాల వినియోగం, అపరాల పంటపై అంతుచిక్కని తెగుళ్ల తదితర కారణాలతో మూడవ పంట ఏ ఏడాదికాఏడాది తగ్గిపోతూ వస్తోంది. తూర్పుడెల్టాలో రైతులు దాళ్వాసాగు అనంతరం సుమారు 80 శాతం పొలాల్లో అపరాల సాగు చేపట్టేవారు. వరి పంట సాగులో నారుపోసిన నాటి నుంచి నాట్లు వేయటం, కాలిబాటలు, కలుపుతీత, పురుగుమందులు, ఎరువులు చల్లిక వంటి అనేక ఖర్చులు అధికంగా ఉంటాయి. అపరాల సాగులో వరి పంటకు వచ్చిన ఆదాయం రాకపోయినప్పటికీ పొలంలో విత్తనాలు చల్లాక అవసరాన్ని బట్టి ఒకటి, రెండుసార్లు పురుగుమందులు చల్లడం మినహా ఇతర ఖర్చులేమీ ఉండవు. దీంతో రైతులు అపరాల సాగుకు మొగ్గు చూపేవారు.

మారుతున్న పరిస్థితులు

ఇటీవల కేవలం 20 శాతం పొలాల్లో కూడా అపరాల సాగు జరగటం లేదు. మారుతున్న పరిస్థితులే ఇందుకు కారణం. గతంలో మే చివరి వారం నాటికి కాలువ నీరు విడుదల చేసేవారు. దీంతో జూన్, జూలైలలో తొలకరి సాగు, నవంబరు లేదా డిసెంబరులలో దాళ్వా సాగు ప్రారంభమయ్యేది. మార్చి నెలాఖరుకు రెండవ పంట పూర్తి స్థాయిలో చేతికొచ్చేది. ఆ సమయంలోనే అపరాలకు అసలైన పదును కుదురుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెల పూర్తి కావస్తున్నప్పటికీ మండల గ్రామాలలో పూర్తి స్థాయిలో దాళ్వాపంట పక్వానికి రాలేదు. దీంతో అపరాలను సాగు చేసేందుకు వీలులేకుండా పోతోంది.

యంత్రాల వినియోగం మరో కారణం

దాళ్వా మాసూళ్లు ఆలస్యమై అదును దాటిపోవటం అపరాలసాగు తగ్గిపోవటానికి ఒక కారణమైతే వరిపంట కోతకు యంత్రాలు వినియోగం మరో కారణం. పొలంలో పెసరా లేదా మినుము వంటి అపరాలు సాగు చేయాలంటే పొలంలోని మట్టిలో తేమ ఉండాలి. గతంలో పంట కోతకు రెండు, మూడు రోజులు ముందు నెల తడితడిగా ఉండగా రైతులు అపరాల విత్తనాలు చల్లి కూలీలతో వరిపంట కోత కోయించేవారు. ఆపై పొలంలో చల్లిన అపరాల విత్తనాలు మొలకలు వచ్చి పెరిగేవి. ప్రస్తుతం అధికశాతం రైతులు పంటకోతకు యంత్రాలను వినియోగిస్తున్నారు. యంత్రాలు పొలంలో తిరగాలంటే నేల పూర్తిగా తడిఆరిపోయి ఉండాలి. దీంతో పొలంలో రైతులకు అపరాల విత్తనాలు చల్లేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఈ పరిస్థితులను అధిగమించి కొందరు రైతులు ఆలస్యమైనా ఆశ చావక పెసరా లేదా మినుము సాగు చేయడానికి సిద్ధమవుతున్నప్పటికీ అదును దాటిన తర్వాత సాగు చేయటంతో సాగు చేసిన ప్రాంతమంతా పూత దశకు వచ్చేసరికి తెగులు సోకి ఎందుకు పనికి రాకుండా పోతోందని పలువురు రైతులు చెబుతున్నారు.

> **ప్రభుత్వం రాయితీపై విత్తనాలు ఇస్తోంది**
>
> అపరాల సాగు వల్ల భూమిలో నత్రజని పెరిగి భూసారం వృద్ధి చెందటంతోపాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఏ ఏడాదికాఏడాది వరి సాగు ఆలస్యమవుతుండటంతో దాని ప్రభావం అపరాల సాగుపై పడుతోంది. ఎండల తీవ్రతకు తెగళ్ల ఉధృతి ఎక్కువవుతుండటంతో అపరాలు సాగుచేసినా దిగుబడి ఉండడం లేదు. మార్చి నెలాఖరు నాటికి దాళ్వా పంట పూర్తయితే అపరాల సాగుకు వాతావరణం అనుకూలిస్తుంది. అపరాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెసర, మినుము, పిల్లి పెసర వంటి అపరాల విత్తనాలను 50 శాతం వరకూ రాయితీపై అందితోంది.
>
> – వి.అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు

ఐదో రోజుకు లలితా సహస్ర నామ పారాయణ



ద్రాక్షారామ మాణిక్యాంబసన్నిధిలో లలితా సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళా భక్తులు

రామచంద్రపురం రూరల్: జగద్గురువు ఆది శంకరాచార్యులు జయంతిని పురస్కరించుకుని అష్టాదశ శక్తి పీఠం ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశాల మేరకు ప్రారంభించిన శ్రీ లలితా సహస్ర నామ పారాయణ ఐదోరోజుకు చేరుకున్నట్లు ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణ మూర్తి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆలయ ఆధ్యాత్మిక శోభను మరింత పెంచుతూ రోజూ సాయంత్రం 5 గంటలకు భక్తితో పారాయణలో పాల్గొంటున్న మహిళా భక్తులను ఈఓ అభినందించారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



వెల్లసావరంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించిన పెద్దలు, సంస్థ ప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల శివారు వెల్లసావరంలో కేవీఆర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్ కేవీవీ సత్యనారాయణ (డాక్టర్ సత్తిబాబు) 2017 నుంచి తన తండ్రి కొప్పిశెట్టి వెంకట్రావు పేరున సంస్థను ఏర్పాటు చేసి గ్రామంలోని ఏడు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారికి సాయం చేస్తున్నారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోను, వెల్ల పీహెచ్‌సీ పరిధిలో చికిత్స పొందుతున్న టీబీ రోగులకు వారికి రోగం నయం అయ్యే వరకు మందులు, పోషకాహారం అందించేలా దత్తత తీసుకున్నారు. రెండు ట్రై సైకిళ్లు రామచంద్రపురం పట్టణంలోని బెతెస్థ న్యూలైఫ్ సెంటర్‌లో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు అనాధ దివ్యాంగులకు తల్లి కొప్పిశెట్టి లక్ష్మి, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, ఏజీపీ, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ మోహన్ వెంకటరమణ, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పసలపూడికి చెందిన టెక్ ఎక్సపర్ట్ సొల్యూషన్స్ అధినేత వాసంశెట్టి జనార్ధన్‌ల చేతుల మీదుగా అందజేశారు. మరో రెండు పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని దివ్యాంగులకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దత్తత చేసుకున్న ఏడు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. న్యాయవాది ఇంత సుకుమారన్, కరాటే రత్నం, ఏరియా ఆసుపత్రి హెల్త్ సూపర్‌వైజర్ బేబీరాణి, డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, సొసైటీ చైర్మన్ దంగేటి చినబాబు పాల్గొన్నారు.

నేడు మే డే వేడుకలు

రామచంద్రపురం: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మే డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు పట్టణ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు మార్కెట్లో జట్టు సంఘం భవనం వద్ద, 8.15 గంటలకు బాబ్జీ సైకిల్ షాప్ దగ్గర, 8.30 గంటలకు రెల్లి వీధిలో, 9 గంటలకు బీరు ఫ్యాక్టరీ వద్ద, 9.30 గంటలకు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ వద్ద, 9.45 గంటలకు మినీ గూడ్స్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ వద్ద, 10.15 గంటలకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వద్ద, 10.40 గంటలకు మోటార్ వర్కర్స్ యూనియన్ లారీ ఓనర్స్ అసోసియేషన్ వద్ద, 11 గంటలకు డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఏఐటీయూసీ కార్యకర్తలు, సీపీఐ కార్యకర్తలు, ప్రజానాట్య మండలి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వర్ష బీభత్సం

- పలుచోట్ల విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- ధాన్యం కాపాడుకునేందుకు రైతుల పాట్లు



రాయవరం మండలం లొల్లలో ధాన్యంపై కప్పిన బరకాలు



మండపేటలో ధాన్యం తడవకుండా బరకాలు కప్పుతున్న రైతులు



తాపేశ్వరంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మండపేట: మండపేట, మండల గ్రామాల్లో ఆదివారం కురిసిన భారీ వర్షంతో పలుచోట్ల చెట్లు కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కళ్లాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అగచాట్లు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నం వరకు ఎండ కాయగా తర్వాతి నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గాలులతో కొద్దిసేపు భారీ వర్షం కురిసింది. మండపేటలోని విజయలక్ష్మి నగర్, తాపేశ్వరం, వెలగతోడు, వై.సీతానగరం గ్రామాల్లో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు ముందుగానే అప్రమత్తమై సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. మొత్తం 30 స్తంభాలు విరిగి పడగా సుమారు రూ. 4.5 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్టు ఏడీఈ జి.తిరుమలరావు తెలిపారు. మండపేటతో పాటు పలు గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం తెరిపిచ్చాక విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది సత్వర చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా వైర్లు సరిచేసి సాయంత్రం నుంచి సరఫరాను పునరుద్ధరించారు. వైర్లు తెగిపడిన చోట్ల సోమవారం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయనున్నట్టు ఏడీఈ తిరుమలరావు తెలిపారు.

రైతుల అగచాట్లు

వరికోతలు, నూర్పిడులు తదితర దాళ్వా పంట తుది దశ పనులు ఎక్కడికక్కడ ముమ్మరంగా జరుగుతున్నాయి. తేమశాతం తగ్గించేందుకు ధాన్యాన్ని కళ్లాల్లోను, రోడ్ల పక్కన, దిమ్మలపై ఆరబెట్టుకుంటున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రైతులను పరుగులు పెట్టిస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన వర్షంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అగచాట్లు పడ్డారు. ఆరబెట్టిన ధాన్యాన్ని దగ్గరకు పోగుచేసి తడవకుండా బరకాలు కప్పుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. వర్షాలకు ధాన్యం తడిస్తే తేమశాతం పెరిగి తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

వీడని వాన

రాయవరం: అన్నదాతను అకాల వర్షాలు వీడడం లేదు. శనివారం ఉరుములు, మెరుపులతో వర్షం కురవగా, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మరోసారి కురిసిన వర్షం రైతన్నకు తీవ్ర నష్టం కలిగించింది. పలు చోట్ల వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో పక్క కోసిన మాసూళ్ల ద్వారా వచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించుకునేందుకు రైతులు ఆరబోసుకునే పనిలో ఉన్నారు. కళ్లాలు, పొలంగట్లు, రహదారి చెంతనే రైతులు ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. అప్పటి వరకు పొడి వాతావరణం ఉండగా, మధ్యాహ్న సమయంలో కురిసిన వర్షానికి రైతులు ధాన్యం వర్షం పాలు కాకుండా కాపాడుకునే ప్రయత్నాన్ని చేశారు. ధాన్యం తడవకుండా బరకాలు కప్పుకున్నారు. కొన్నిచోట్ల ధాన్యం రాశులు వర్షానికి తడిసిపోయాయి. ఇప్పటికే వాతావరణ శాఖ మూడు రోజులపాటు వర్షాలు ఉంటాయని చెప్పడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరికి జన్మ నక్షత్ర పూజలు



అమ్మవారి ఊరేగింపులో కానుకలు సమర్పిస్తున్న భక్తులు



అంగర కన్యకాపరమేశ్వరి సత్రంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



రాయవరంలో నిర్వహిస్తున్న గ్రామోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసియున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకుని జన్మ నక్షత్ర పూజలు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై అమ్మవారి ఊరేగింపు బ్యాండు మేళాలు, కేరళ నృత్యాలతో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, సంఘ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి కుంకుమ పూజ

కపిలేశ్వరపురం: వాసవీ కన్యాపరమేశ్వరి పుట్టినరోజును పురస్కరించుకుని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు ఆదివారం కుంకుమ పూజ చేశారు. ఆయా గ్రామాల మహిళా భక్తులచే అంగరలోని శ్రీకన్యకాపరమేశ్వరి సత్రంలో వేదపండితులు వారణాసి వెంకటేశ్వరరావు కుంకుమ పూజ చేయించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వాసవీ కన్యకాపరమేశ్వరి మహిమలను వివరించారు.

ఏడిదలో

మండపేట: మండలంలోని ఏడిద శ్రీ వాసవి ఫంక్షన్ హాలులో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి 1020వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత గ్రామోత్సవంలో భాగంగా అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. అనంతరం ఫంక్షన్ హాలులో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఎంపీటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పట్నాల మల్లిబాబు, సంఘ నాయకులు మోహన్‌రావు, గ్రంధి సూరిబాబు, పసుమర్తి సత్యనారాయణ, చామర్తి లావరాజు పాల్గొన్నారు.

రాయవరం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాన్ని రాయవరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. తొలుతగా వాసవీమాత చిత్రపటాన్ని పల్లకీలో మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలు వాసవీమాత చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ పసుపు కుంకుమలు సమర్పించి చిన్నారులను చల్లగా చూడాలని కోరుకుంటూ వాసవీమాతను వేడుకున్నారు. అనంతరం వాసవీమాత జయంత్యుత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు గోవర్ధనకృష్ణ, ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రావు, ట్రెజరర్ దిగవల్లి వీరవెంకటచంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఆలయం ఆధ్యాత్మిక శోభితం కావాలి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్



ఆలయ నూతన చైర్మన్ ధర్మారావును సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ఆలయ ధర్మకర్తలుగా బాధ్యతలు చేపడుతున్న వారంతా ఆయా ఆలయాల్ని ఆధ్యాత్మిక శోభితంగా మార్చాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పిలుపునిచ్చారు. అమలాపురం కృష్ణేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి నూతనంగా ఎంపికైన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవ సభకు మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేవస్థానంలో ఆదివారం జరిగిన ఈ సభకు మంత్రి విశ్వరూప్‌తో పాటు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిలు పాల్గొని నూతన ధర్మకర్తల మండలిచే ప్రమాణ స్వీకారం చేయించారు. దేవస్థానం చైర్మన్‌గా దొమ్మేటి ధర్మారావుతో పాటు ఆరుగురు ధర్మకర్తలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన ధర్మకర్తలను మంత్రి సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు వాసర్ల లక్ష్మి, గొవ్వాల రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో లయన్స్ సేవలు

తాళ్లరేవు: లయన్స్ క్లబ్ సేవలను మరింత బాధ్యతతో ముందుకు తీసుకువెళతామని నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్య నారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నూతన గవర్నర్ కర్టెన్ రైజర్ కార్యక్రమం గవర్నర్ రిప్రజంటేటివ్ నడింపల్లి వినోద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణను సత్కరించారు. ప్రస్తుత గవర్నర్ మాటూరి మంగతాయారు, పూర్వపు గవర్నర్‌లు శుభాకాంక్షలు తెలియజేసి దిశానిర్దేశం చేశారు. లయన్స్ ప్రతినిధులు బాదం బాలకృష్ణ, ముంజులూరి విశ్వేశ్వరరావు, బీవీఎస్ రెడ్డి, ఈవీవీ ఈశ్వర్ కుమార్, వజ్రపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జల పుష్పాల జాడేదీ?

- సంప్రదాయ చేపలు కనుమరుగు
- మత్స్యకారుల ఆందోళన
- కాలువ చేపల ధరలకు రెక్కలు
- మాంసాహారుల నిరాశ



యర్రపోతవరం వద్ద కాలువలో చేపల కోసం వల విసురుతున్న దృశ్యం



కాలువ చేపలు

కె.గంగవరం: ఏటా గోదావరి సెంట్రల్ డెల్టాకు సాగునీరు నిలుపుదల చేయడంతో మత్స్యకారులు, సామాన్య ప్రజలు సైతం చేపల వేటలో నిమగ్నమవుతారు. గ్రామాల్లో సైతం కాలువలకు అడ్డుగా మావులు వేసి చేపలు పట్టి రుచిగా వండుకు తినేవారు. గోదావరి, సముద్ర చేపలతో పోలిస్తే కాలువ చేపలకు మంచి డిమాండ్‌తో పాటు ప్రజల్లో ఆసక్తి కూడా ఉంటుంది. అయితే అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న కాలువ చేపలు క్రమేపీ కనుమరుగవుతున్నాయి. గతంలో కాలువలు మూసేసిన వెంటనే అధిక సంఖ్యలో కాలువ చేపలు లభ్యమయ్యేవి. బొమ్మిడాయిలు, కొరమేనులు, పీతలు, పిత్త పరిగెలు, గొరసలు నేడు మచ్చుకైనా కానరావడం లేదు. రామచంద్రపురం నియోజకవర్గంలోని వెల్ల లాకులు, కూళ్ల గ్రామాల్లో ఇప్పటికే అడపదడపా పడుతున్న చేపలను అధిక రేట్లకు అమ్మినా మాంసం ప్రియులు ఎగబడి మరీ కొనుగోలు చేస్తున్నారు. కానీ మత్స్యకారులు చేపల వేట కొనసాగించినా చేపల లభ్యం నామమాత్రం కావడంతో వారు జీవనోపాధి కోల్పోతున్నారు. ఆంధ్ర జలచరాల వంటకాల్లో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ జల పుష్పాలు కాల క్రమేణా అంతరించిపోతుండడంతో మాంసాహారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. దీనికి తోడు పిత్తపరిగెలతో పాటు కాలువల్లో లభ్యమయ్యే కొన్ని చేపలు తినడం ఆరోగ్యానికి కూడా మంచిదని అంటారు. అయితే అలాంటి చేపలు అంతరించిపోవడం వల్ల నిరాశ చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో ఐదారేళ్లలో కాలువ చేపలు పూర్తిగా అంతరించిపోతాయని మత్స్యకార నిపుణులు హెచ్చరిస్తున్నారు. బొమ్మిడాయిలు, కొరమేనులు మన సంప్రదాయ చేపలు, అవి బురద, కాలువ అడుగు భాగంలో జీవిస్తాయి. ఏప్రిల్, మే నెలల్లో కాలువలు మూసివేసిన తరువాత ఈ రకం చేపలు ఒకప్పుడు అధికంగా లభించేవి. ప్రస్తుతం అవి కనుమరుగువుతున్నాయని పల్లె ప్రజలు చెబుతున్నారు. అంతరించిపోతున్న ఈ చేపలు అడపాదడపా మార్కెట్‌లలో దొరకడంతో వీటి ధర చుక్కలను తాకుతోంది. సాధారణ చేపల కిలో ధర రూ.200 ఉంటే బొమ్మిడాయిలు, కొరమేనులు ధర రూ.400 వరకు ఉంది. మత్స్యకార శాఖ దృష్టి సారించి అంతరించుకుపోతున్న ఈ జలపుష్పాలను సంరక్షించుకునేందుకు చర్యలు తీసుకోవాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.

రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం



కాలువ చేపలు రుచికి రుచి ఉండడంతో పాటు ఆరోగ్యానికి కూడా మంచివి. మా చిన్నతనంలో వేసవి కాలం వచ్చిందంటే చిన్న చేపల కోసం ఎదురుచూసే వాళ్లం. ఆ చేపలు తినడం ఎంతో సంతోషకరంగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ రకం చేపలు కనుమరుగయ్యాయి.

– రాయుడు జగన్, నల్లచెరువు పుంత

మత్స్య సంపదను కాపాడుకోవాలి



కాలువల్లో దొరికే మత్స్య సంపద నానాటికీ కనుమరుగవుతోంది. అంతరించిపోతున్న కాలువ చేపలను భావితరాల కోసం కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రస్తుతం ఎంత వెతికినా కాలువ చేపల జాడ దొరకడం లేదు.

– పెంకే రవిచంద్ర, పామర్రు